ముమ్మరంగా వరినాట్లు

- శాలిగౌరారం మండలంలో 20వేల ఎకరాలలో వరిసాగు అంచనా
- ఇప్పటికే 6వేల ఎకరాలకు పైగా నాట్లు పూర్తి
- మరో నెల పాటు కొనసాగనున్న పనులు



శాలిగౌరారంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

శాలిగౌరారం : మండలంలోని వానాకాలం వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. శాలి గౌరారం ప్రాజెక్టు ఆయకట్టుతో పాటూ నాన్ ఆయకట్టుగా ఉన్న వ్యవసాయ బోరుబావుల కింద ప్రస్తుతం వరిసాగు చేస్తున్నారు. వరినాట్ల పనులు ప్రారంభం కావడంతో అటు ట్రాక్టర్లకు, ఇటు కూలీలకు చేతినిండా పనిదొరుకుతుంది. ఈనేపధ్యంలో రైతులు, కూలీలు బిజీబిజీగా మారిపోయారు.

44500 ఎకరాలలో పంటల సాగు..

మండలంలో మొత్తం 44500 ఎకరాల వ్యవసాయ సాగుభూమి ఉంది. అందులో ఈ సంవత్సరం 23వేల ఎకరాలలో పత్తి సాగు చేస్తుండగా, 20 వేల ఎకరాలలో వరిపంట, 1500 ఎకరాలలో ఇతర పంటల సాగు జరుగుతున్నట్లు వ్యవసాయ అధికారుల నివేధికలు తెలుపుతున్నాయి. ఇదిలా ఉండగా మండలంలో రెండు వారాల క్రితమే వరినాట్లు ప్రారంభం కావడంతో ఇప్పటి వరకు సుమారు 6వేల ఎకరాలకు పైగా వరినాట్లు పూర్తైనట్లు మండల వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

ఆయకట్టులో ప్రారంభమైన వరినాట్లు..

మండలంలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు కింద ఆయకట్టులో వరినాట్లు ఇప్పుడే ప్రారంభమయ్యాయి. మూసీనది పరివాహాక గ్రామాలతో పాటూ శాలిగౌరారం ప్రాజెక్టు రాచకాల్వ వెంట, నాన్‌ఆయకట్టులో బోరు బావుల కింద వరినాట్లు నడుస్తున్నాయి. మండలంలో మొత్తం 24 గ్రామపంచాయతీలు ఉండగా అందులో శాలిగౌరారం ప్రాజెక్టు కింద మండలంలోని 9గ్రామాల్లో సుమారు 5వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. మండలంలోని ఏడు గ్రామాలు మూసీనది పరివాహాక గ్రామాలుగా, 8 గ్రామాలు నాన్ ఆయకట్టు గ్రామాలుగా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో నాన్‌ఆయకట్టు గ్రామాలలో వరిసాగు ఆలస్యం కానుంది. శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి గత నెల 10న ఎమ్మెల్యే మందుల సామేల్ సాగుకు నీరువిడుదల చేయడంతో ఆయకట్టులో వరినాట్లు మరింత ముమ్మరం కానున్నాయి.

వలస కూలీలు రావడంతో తగ్గిన కొరత..

మండలంలో ప్రతి సంవత్సరం వానాకాలం వరిపంట సాగుకు నాట్లు వేసేందుకు కూలీల కొరత రైతులను వెంటాడేది. కానీ ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి కూలీలు వరినాట్లు వేసేందుకు మండలానికి వలసలు రావడంతో వరినాటు కూలీల కొరత తగ్గింది. సాగర్ ప్రాజెక్టు కింద నీటి విడుదల జరగకపోవడంతో ఆ ఆయకట్టు గ్రామాలకు చెందిన కూలీలతో పాటు ఏపీలోని ప్రకాశం, ఒంగోలు, గుంటూరు జిల్లాలకు చెందిన కూలీలు వరినాట్లు కోసం మండలానికి వలసలు వచ్చారు. దీంతో మండలంలో వరినాట్లకు కూలీల కొరత తగ్గింది.

ముందస్తుగా నార్లు పోసుకున్నాం



ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు భారీ వర్షాలు కురవలేదు. అయినా శాలిగౌరారం ప్రాజెక్టు నిండుగా ఉండడంతో ఇక్కడ భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఉన్న బోరు బావుల కింద ముందస్తుగా నార్లు పోసుకోవడంతో సకాలంలో వరినాట్లు వేయగలుగుతున్నాం. ప్రాజెక్టు నిండకపోతే బోరుబావుల కింద కూడా వరిసాగు సకాలంలో చేయలేక పోయేవాళ్లం.

– కల్లూరి సైదులు, రైతు, శాలిగౌరారం

సాగునీటి సమస్య లేదు



నేను నాకున్న రెండెకరాల భూమితో పాటు మరో 5ఎకరాలు కౌలుకు తీసుకొని వరిసాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం వానాకాలం వరిపంట సాగుకు శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి సకాలంలో సాగునీటి విడుదల జరిగింది. దీంతో సాగునీటి సమస్య లేకుండా సకాలంలో వరినాట్లు వేయగలిగాం.

– నిమ్మల శ్రీను, రైతు, శాలిగౌరారం

క్లుప్తంగా

రేణుకాఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్ : మండలంలోని దర్వేశిపురంలో ఉన్న రేణుకఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం అర్చకులు విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి కుంకుమతో అభిషేకం, పూజలు చేశారు. మహిళా భక్తులు చీర, సారె, బోనాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అంబటి నాగిరెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే



ఇంజనీర్స్ డేలో పాల్గొన్న ఇంజనీర్లు

నల్లగొండ : పట్టణంలోని ఎస్‌ఈ పీఆర్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా ఇంజనీర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీర్లు రామచంద్రారెడ్డి, దీపక్, చెన్నకేశవులు, శ్యాంసుందర్, రాములు, మానస, దీప్తి, అశోక్, మూర్తి, శ్రీధర్, దీపిక, రవళి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

నల్లగొండ : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో శుక్రవారం గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. గ్రేడ్ 2 హెచ్‌ఎంల ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. అవసరమైన చోట నూతన పాఠశాలల ఏర్పాటు, అర్హులైన ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్లను జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సైదులురెడ్డి, కాసం ప్రభాకర్, ఎ.బుచ్చిరాములు, కె.సంపత్‌కుమార్, ధర్మానాయక్, సైదయ్య పాల్గొన్నారు.

కాళికామాత ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నకిరేకల్ : పట్టణంలోని సంతోష్‌నగర్‌లో గల శ్రీస్వయంభూ కాళికామాత దేవాలయంలో శుక్రవారం అమ్మవారి ఆషాఢ బోనాల ఉత్సవాల ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కూరగాయల అలంకరణ చేశారు. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మదేవర రవిశంకర్, గౌరవ అధ్యక్షుడు కందాల లక్ష్మీనారాయణరెడ్డి, ఆలయ అధ్యక్షుడు గర్రె మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి కొండేటి శ్రీను, గోగికార పరమేష్, బచ్చు శ్రీనివాస్, పల్లెర్ల యాదగిరి, అంబేద్కర్, శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : గద్వాల్ పట్టణంలో ఈ నెల 13, 14తేదీల్లో ఆవాజ్ 3వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం తెలిపారు. శుక్రవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో ఆవాజ్ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ సభలకు మాజీ పార్లమెంట్ సభ్యురాలు సుభాషిని అలీతో పాటు 500మంది నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఎస్‌కె మహబూబ్‌అలీ, పట్టణ కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్, సాజిద్, ఎంఏ రెహమాన్, హరీష్, సయ్యద్ నిజాం, ఎండీ ఫయాజ్, ఎండీ వహీద్, యూనిస్, సయ్యద్ యూసిఫ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

మునుగోడు : ప్రభుత్వం బ్యాంకుల ద్వారా మహిళలకు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి సూచించారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పలివెల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు కళాకారులతో అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందించి సోలార్‌ప్లాంటు, బస్సులు, పెట్రోల్ బంక్‌లు, మినీ గోధామ్‌లు, ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్ల వ్యాపారానికి ప్రోత్సహిస్తుందన్నారు. అంతే కాకుండా ఆ రుణాలకు బీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ప్రభుత్వ సహాయ, సహకారాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం మైసేశ్వర్‌రావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు పంతంగి రాధ, సీసీలు శ్రీనివాస్, అంజయ్య, శంకరయ్య, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల భూమిని కాపాడాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నెర్మట వాసులు

చండూర్ : మైనార్టీల భూమిని కాపాడాలని మండలంలోని నెర్మట గ్రామస్తులు శుక్రవారం చండూర్ ఆర్డీఓ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ కల్లు గీతా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా వెంకన్న మాట్లాడారు. మైనార్టీలకు 60సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం ఇచ్చిన 5గుంటల భూమిని వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ ఆ భూమి వారికి దక్కకుండా రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ధనుంజయ, గ్రామస్తులు క్రిష్ణయ్య, హుస్సేన్, జహంగీర్, నరసింహ, వెంకటయ్య, లక్ష్మయ్య, నాగరాజు, స్వామి, సైదులు, అనిల్, శంకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నకిరేకల్ : నాగరాజుకు ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

నకిరేకల్ : శాలీగౌరారం మండలంలోని ఇటుకులపాడు గ్రామానికి చెందిన అగ్రి ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యుడు కన్నం నాగరాజు ఇటీవల ప్రమాదానికి గురై గాయపడ్డాడు. శుక్రవారం నాగరాజుకు నకిరేకల్ అగ్రిఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.32,600 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మన్నెం లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు వేముల వీరస్వామి, కార్యదర్శి జిల్లా రామకృష్ణ, కోశాధికారి యాతాకుల నాగార్జున, చింతల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : మండల కేంద్రానికి చెందిన నిరుపేద గోలి పార్వతమ్మ ప్రమాదానికి గురై మృతి చెందింది. ఆమె అంత్యక్రియల నిమిత్తం కాంగ్రెస్ మండల నాయకుడు ముచ్చపోతుల శ్రీనివాసులు శుక్రవారం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. దహన సంస్కారాలకు హాజరైన బంధువులు, కుటుంబ సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

మర్రిగూడ : మండలంలోని అజ్జిలాపురం గ్రామానికి చెందిన మెగావత్ లచ్చిరాంనాయక్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాల్య స్నేహితుడు, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు వల్లంల సంతోష్‌యాదవ్ శుక్రవారం లచ్చిరాం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు, 50కేజీల బియ్యం అందించారు. ఆయన వెంట రామిడి వెంకటరమణారెడ్డి, పుల్లయ్య, చందునాయక్, ముత్తు, శంకర్, శ్రీశైలం, వెంకటేష్, గణేష్, శ్రీను ఉన్నారు.



మర్రిగూడ : లచ్చిరాంనాయక్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న సంతోష్‌యాదవ్

నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గుండ్లపల్లి జయసుధ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు కట్టగూరి శ్రీను శుక్రవారం 50కిలోల బియ్యం, నూనె, కిరాణ సామగ్రి అందజేశారు. ఆయన వెంట బండారు అంతయ్య, పెరుమాండ్ల నరేశ్, మాదగోని వెంకన్న, జోలం మహేశ్, గుండ్లపల్లి నాగరాజు, మనోహర్, శంకరయ్య శ్రీనివాస్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుక

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని 47వవార్డు విద్యానగర్‌లో మహిళా శక్తి గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆషాఢ గోరింటాకు వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు గోరింటాకు చేతులపై పెట్టుకుని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ అబ్బగోని కవిత రమేష్, చకిలం సంధ్యారాణి, ఐద్వా నాయకురాలు తుమ్మల పద్మతో పాటు పలువురు మహిళలు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పద్మ, గోవిందమ్మ, కవిత, గాయత్రి, రజని, రేణుక, తులసి, జమున, జ్యోత్స్న, కాలనీ మహిళలు పాల్గొన్నారు.



కోమటిరెడ్డి కృష్ణారెడ్డి మృతికి ఎమ్మెల్యేల నివాళి



కృష్ణారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, వీరేశం

నార్కట్‌పల్లి : మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి చెందిన కోమటిరెడ్డి కృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, వారిజాల వేణుగోపాలస్వామి దేవాలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, బండ సాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ధర్మయ్య, స్వామి తదితరులు ఉన్నారు.

మహిళా సభ్యులంతా అక్షరాస్యులుగా మారాలి

చిట్యాల : గ్రామీణ ప్రాంతాలలోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులంతా అక్షరాస్యులుగా మారాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీఎస్‌ఎస్) స్టేట్ కో ఆర్డినేటర్ ఏ.విజయక్రిష్ణ కోరారు. శుక్రవారం మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో మహిళా గ్రామ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘాలలోని మహిళ సభ్యులంతా వయస్సుతో సంబంధం లేకుండా అక్షరాస్యులుగా మారాలని సూచించారు. ఇందుకుగాను ప్రత్యేక వలంటీర్ల ద్వారా విద్యాభ్యాసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో నిరక్షరాస్యులైన పది మంది మహిళా సంఘం సభ్యులకు ఎన్‌రోల్‌మెంట్ చేసుకుని అక్షరాస్యులుగా మార్చేందుకుగాను విద్యా వలంటీర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఎస్ కన్సల్టెంట్ ఎస్‌ఎం.భాష, ఆడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ మమత, ఏపీఎం కె.పద్మ, వీఓఏ సత్యనారాయణ, అనురాధ, సంఘ బంధం అధ్యక్షురాలు మమత, మహిళలు పాల్గొన్నారు.

సరిపడా ఎరువుల నిల్వలు

శాలిగౌరారం : మండలంలో పంటల సాగుకు సరిపడా ఎరువులు, విత్తనాలు నిల్వలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యూరియా కొరత ఉందని వస్తున్న సమాచారంతో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు తప్పవన్నారు. ఎరువుల అమ్మకాల విషయంలో ఫర్టిలైజర్ దుకాణదారులు ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమాచారం అందిచాలని రైతులకు సూచించారు.

పంట నష్టంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

శాలిగౌరారం : మండలంలోని భైరవునిబండ గ్రామంలో వ్యవసాయ పొలాల్లో విద్యుత్ టవర్ నిర్మాణంతో జరిగిన పంట నష్టంపై బాధిత రైతులు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు దండ అశోక్‌రెడ్డి, దండ రేణుక మాట్లాడారు. దామరచర్ల నుంచి జనగాం వరకు నిర్మిస్తున్న 400కేవీ విద్యుత్ టవర్‌లైన్‌ను మా అనుమతి లేకుండా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మా భూముల్లో నిర్మిస్తున్నారని అన్నారు. విద్యుత్ టవర్ నిర్మాణ స్థలంతో పాటు టవర్ నిర్మాణ స్థలానికి వచ్చేందుకు తమ సొంత భూమి మూడెకరాల నుంచి దారిని ఏర్పాటు చేసుకున్న సంబంధిత విద్యుత్ టవర్ నిర్మాణదారులు వరి, పత్తి పంటలను ధ్వంసం చేశారన్నారు. ఈ విషయంపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపి మాకు న్యాయం చేయాలని ఇప్పటికే స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఆర్డీఓలతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల ఆమోదంపై నాయకుల హర్షం



కట్టంగూర్ : సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిట్యాల : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుకుగాను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వట్టిమర్తి గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నర్రా వినోద మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, నాయకులు జడల చినమల్లయ్య, బుర్రి రవీంధర్‌రెడ్డి, చెర్కుపల్లి శ్రీశైలం, కాటం సత్తయ్య, మేడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల ఆమోదంపై పాలాభిషేకం

నకిరేకల్ : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడం కోసం రాష్ట్ర క్యాబినేట్ ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, కల్లు గీత సంఘం అధ్యక్షుడు కొండ వెంకన్నగౌడ్, నాయకులు పన్నాల రాఘురెడ్డి, లింగాల వెంకన్న, సకినాల రవి, కందాల భిక్షంరెడ్డి, యాసారపు వెంకన్న, చౌగోని సైదులు, పోతుల రవి, గునగంటి రాజు, మంగినపల్లి రాజు, గోలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

కట్టంగూర్ : స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలని రాష్ట్ర క్యాబినేట్‌లో నిర్ణయం తీసుకోవడం పట్ల శుక్రవారం కాంగ్రెస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, మండల నాయకులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్నయాదవ్

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్నయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. కార్పొరేషన్ పదవుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లు దివ్యాంగులకు కేటాయించాలన్నారు. ఈ నెల 14న నల్లగొండలో నిర్వహించే వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సుకు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నందున అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు మేతరి రాములు, నాయకులు ముద్దం నరసింహగౌడ్, కసిరెడ్డి చైతన్యరెడ్డి, తిరుమలేష్, కావేరి, పున్నం ఆంజనేయులు, బొంత దశరథ, రమేష్, కల్లెట్ల శంకర్, సత్తయ్య, రాములు, జంగయ్య, భిక్షమయ్య, శ్రీకాంతాచారి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆమరణ దీక్ష



కుటుంబ సభ్యులతో కలిసి దీక్ష చేస్తున్న రాములు

మునుగోడు : తన తండ్రికి తనకు మధ్య ఉన్న ఆస్తుల గొడవను పరిష్కరించాలని కోరుతూ ఓ కొడుకు తన భార్య పిల్లలతో కలిసి శుక్రవారం ఆమరణ నిరాహార దీక్షకు దిగాడు. వివరాల ప్రకారం.. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన కోడి చంద్రయ్యకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల చంద్రయ్య తన కుమారుడు మంచి చెడులు చూడడం లేదని రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. నేను నా కుమారుడికి ఇచ్చిన ఇల్లు తిరిగి ఇప్పించాలని విన్నవించుకున్నాడు. దీంతో చండూరు ఆర్డీఓ ఆ ఇల్లును ఆ వృద్ధుడికి తిరిగి ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో కొడుకు రాములు ఆ ఇల్లు తన తండ్రిది కాదని, అది నేను సంపాదించుకున్నదని, తన తండ్రి సంపాధించిన ఇల్లు, ఇతర ఆస్తులు 2018లో తన సొదరి వివాహం కాకముందే ఆమె పేరుమీద గిఫ్ట్ డీడీతో పట్టాచేసి ఇప్పుడు నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించాడు. నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్న తండ్రి నుంచి నాకు రక్షణ కల్పించి నాకు నాతాత, తండ్రి ఆస్తుల నుంచి సగభాగం ఇప్పించి గ్రామ పెద్దలు అండగా ఉండాలని గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆమరణ దీక్షకు దిగారు.



మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో జరిగిన కార్యక్రమంలో సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్ భజరంగ్‌ప్రసాద్‌కు ఇంటర్నేషనల్ మనం బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి, నల్లపరాజు తదితరులు

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేతేపల్లి : మండలంలోని కొప్పోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల భీమారం, కొప్పోలు ఫీడర్లలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ టి.శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

మర్రిగూడ ఏపీఓగా జయరాజు

మర్రిగూడ : మండల నూతన ఏపీఓగా జయరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన డిండి మండలం నుంచి బదిలీపై వచ్చారు. అంతకుముందు ఇన్‌చార్జ్ ఏపీఓగా వివేక్‌సాగర్ పనిచేశారు.

ఫ్లైఓవర్ పనుల పరిశీలన

చిట్యాల : పట్టణంలోని జాతీయ రహదారిపై జరుగుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను శుక్రవారం నేషనల్ హైవే రోడ్స్ పీడీ నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ ఏడాది డిసెంబర్‌లోగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

యూరియా వినియోగం తగ్గించాలి

మునుగోడు : పంటల దిగుబడికి యూరియా వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని మండల వ్యవసాయ అధికారి పద్మజ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కొరటికల్ గ్రామంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. యూరియాకు బదులు పచ్చిరొట్ట, వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ టి.వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొడాలి అల్వాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

అల్పాహారం అందజేత

నకిరేకల్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్థానిక లయన్స్ క్లబ్, నవ్య క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సు కుమారి భర్త శ్రీశే.ఎంఎ ముజాఫర్ జ్ఞాపకార్థం శుక్రవారం 100మందికి అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రంజిత్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్, ఆసుపత్రి డాక్టర్ సుష్మీత, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ ఎస్.రాంమోహన్‌రావు, నవ్య, సెంటినియల్ క్లబ్‌ల అధ్యక్షురాలు రమాదేవి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, ప్రతినిధులు ఎర్ర శంభులింగారెడ్డి, బాణాల రాంరెడ్డి, ఎల్లపురెడ్డి యాదగిరెడ్డి, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

దామరభీమనపల్లి పాఠశాలలో ఎకో క్లబ్

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎకో క్లబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఉదావత్ లచ్చిరాం విద్యార్థులకు ఎకో క్లబ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.మంజులత, వెంకట్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

గట్టుప్పల్ : మండలంలోని అంతంపేట గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి సైదులు అన్నారు. ఆయన ఇటీవల గ్రామంలో ప్లాస్టిక్‌ను వాడకూడదని కోరుతూ వ్యాపారులకు నోటీసులు అందించి శుక్రవారం ఆకులతో తయారు చేసిన ప్లేట్లను, గ్లాసులను గ్రామంలోని దుకాణాదారులకు అందజేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కట్టంగూర్ : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి శ్వేత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, ఎంఈఓ అంబటి అంజయ్య, ఏపీఓ రాంమోహన్, ఏపీఎం సైదులు ఉన్నారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ సహకరించాలని మండల విద్యాధికారి మేకల నాగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తాటికల్ జెడ్పీహైస్కూల్‌లో ఆయన అడ్మిషన్లు ఇచ్చి మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం పాఠశాలకు 40 అడ్మిషన్లు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య, మర్తా రాములు, సాగర్ల సత్తయ్య, నర్రా వెంకట్‌రెడ్డి, లోట్లపల్లి కోటయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.